సంక్రాంతి పెద్ద పండుగ మూడు రోజుల పాటు ధూమ్‌ధామ్‌గా సాగింది. నోట్లు చేతులు మారాయి. కోళ్ళు కత్తులు కట్టుకున్నాయి. ఓ వైపు కోతాట, మరోవైపు గుండాట, ఇంకో వైపు పొట్టేలు పోటీలు.. ఎక్కడికక్కడ ఏటీ ఎంలే కాదు జనం జేబులు ఖాళీ అయ్యాయి. మద్యం ఏరులై పారింది. తెలంగాణ మద్యం అదనంగా వచ్చిపడింది. బుల్లితెర తారలు దిగొచ్చారు. ప్రజాప్రతినిధులు బరుల వద్ద చుట్టాలయ్యారు. పండుగ ముగిసింది ఇక చాలంటూ యథావిధిగా కనుమ సాయంత్రం ఐదు గంటలకు ఎక్కడికక్కడ బరుల వద్ద పోలీసులు వచ్చి వాలారు.


స్టేడియాన్ని తలపిస్తున్న పెదవేగి మండలం దుగ్గిరాలలోని కోడి పందేల బరి



క్లైమాక్స్‌లో పోలీసులు..

మూడు రోజులపాటు బరుల వద్ద సంబరాలు సాగగా కనుమ పండుగ క్లైమాక్స్‌లో పోలీ సులు రంగ ప్రవేశం చేసి హడావుడి చేశారు. బరుల్లో ఉన్న టెంట్‌లన్నింటినీ రాత్రి 7 గంటల కల్లా తొలగించారు. కొన్నిచోట్ల అప్పటికప్పుడు కేసులు కట్టారు. కనుమ చివరినాడు మూడు రోజుల సినిమాకు క్లైమాక్స్ ఇదే నని పోలీసులను చూసిన జనం కామెంట్లు చేశారు.



కోట్లాట!

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో పట్టణం, పల్లె తేడా లేకుండా వందలాది బరుల్లో పందెం కోళ్ళు ఎగిరి పడ్డాయి. నూజివీడు ప్రాంతంలోని గోప వరం, చెక్కపల్లి వంటి ప్రాంతాల్లో పెద్ద స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. సంప్రదాయ పోటీల పేరిట ముసుగు పందేలు వేశారు. చింతలపూడి, ఏలూరు, దెందులూరు, కైక లూరు వంటి నియోజకవర్గాల్లో అయితే బరు లకు జనం క్యూకట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అతిథులంతా పండుగ మూడు రోజులు బరుల వద్ద గడిపారు. అక్కడే దొరికిన మద్యం, కోడి పకోడితో జల్సా చేశారు. వారి వెనుకే మహిళలు కూడా. ఈసారి పోటీ ల్లో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఐల సంఖ్య కాస్త ఎక్కువ గానే ఉన్నా వారెవ్వరూ కెమెరాల ముందుకు రాకుండా జాగ్రత్తపడ్డారు. ఇక స్థానికులైతే భోగి నుంచి కనుమ వరకు పండుగ పూట తెగ మురిసిపోయి రెచ్చిపోయారు. లక్షల రూపాయలు పందెం కట్టి గెలిచిన వారు కొందరైతే ఓడిన వారు మరికొందరు. కొన్నిచోట్ల అయితే నగదు భద్రత నిమిత్తం అసిస్టెంట్లను అండ తెచ్చుకున్నారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి, దుగ్గిరాల, ముసునూరు, భుజబలపట్నం, వంటి ప్రాంతాలన్నింటిలోనూ జనం ఎగబడ్డారు. ఏడు నియోజకవర్గాల్లో రోజుకు 350 నుంచి 450 మేర పందెంకట్టిన కోళ్ళు పోటీ పడ్డాయి. పండుగ పూట సరదా అంటూ చిన్నారులు కూడా 500 నుంచి 1500 వరకు పందేల్లో బెట్టింగ్ కాశారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఓడిపోయిన వారు ఉన్నారు. పనిలో పని గా తమ ఇంటికి వచ్చిన అతిథులు మురిసి పోయేలా బరుల వద్దే సంబరాలు చేశారు. పెద్ద ఎత్తున బరుల వద్ద కోడి పందేలను మహిళలు వీక్షించారు.

కాస్తంత వెరైటీగా..

ఈసారి కోడి పందేల్లో కాస్తంత వెరైటీ కనిపించింది. గతంలో కేవలం నోట్ల కట్టలతోనే కళ్ళు జిగేల్‌మనిపించేవారు. ఈసారి కోడి పందేలకు వచ్చే వారందరినీ సంతృప్తిపరిచేలా ఎవరికీ పందెం జరిగే తీరు కనపడలేదన్న అపవాదు రాకుండా బరుల వద్ద ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను అమర్చారు. నూజివీడు ప్రాంతంలో ఈ స్ర్కీన్‌ల నడుమ పోటీలు సాగాయి. కొన్ని ప్రాంతాల్లో చేతులకు స్టిక్కరింగ్ వేసి మరీ పంపారు. ఆఖరుకి ఫ్లడ్‌లైట్‌ల్లో తెల్లవార్లూ పందేలు సాగుతుండగా ఎవరూ అలసిపోకుండా నిర్వాహకులందరూ ఏర్పాట్లు చేశారు. కొందరైతే కాస్తంత సేద తీరేందుకు పందెం రాయుళ్ళకు ఏర్పాట్లు చేశారు. తోటల్లో ఈసారి కొత్తగా పందేలు సాగాయి. కొందరికి మాత్రమే సమాచారం ఇచ్చి పందేలు పూర్తి చేశారు. వీఐపీలు, బుల్లితెర నటులు ఇబ్బంది పడ కుండా కారవాన్‌లు అందుబాటులో ఉంచారు.


మండవల్లి మండలం చావలిపాడులో పొట్టేలు పందేలు

పండుగ మూడు రోజులు
పందేల జోరు

- చేతులు మారిన కోట్ల రూపాయలు
- ఎల్‌ఈడీ స్ర్కీన్‌ల ఏర్పాటు.. విజేతలకు బహుమతులుగా బైక్‌లు
- ఫ్లడ్‌లైట్‌ల నడుమ సాగిన పందేలు
- అంతా పూర్తయ్యాకే పోలీసుల రంగ ప్రవేశం

అందరినీ తృప్తిపరిచారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళల్లో ఎవరికీ అసంతృప్తి ఉండరాదనే నేపథ్యంలో తమ అనుచరులు బరులు పెట్టి పందేలు వేసు కోవడానికి ఎమ్మెల్యేలు సహకారం ఇచ్చారు. అంత టితో సరిపెట్టకుండా ఎవరికీ ఎలాంటి వివాదాలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చాలా చోట్ల అతిగా మద్యం తాగిన వ్యక్తులు పందెంబరుల వద్ద వివాదాలకు దిగారు. అటువంటివారికి నచ్చ చెప్పి బయటకు పంపేందుకు పవర్ ఉపయోగిం చారు. ప్రత్యేకించి గొడవలు ఎక్కడా బహిర్గతం కాకుండా ద్వితీయ శ్రేణి నాయకత్వం జాగ్రత్తలు తీసుకుంది. అన్ని ప్రాంతాల్లోను ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలు స్వయంగా పాల్గొని అందరికీ ఉత్సాహం ఇచ్చారు.


కైకలూరు మండలం భుజబలపట్నంలో కోడిపందేలను తన తండ్రి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలిసి తిలకిస్తున్న ఎంపీ మహేశ్ కుమార్


ముసునూరు మండలం గోపవరంలో నేలపై కూర్చుని పందేలను చూస్తున్న 'కల్కి' చిత్ర దర్శకుడు నాగ అశ్విన్


కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో..

ఎంత డబ్బో..

బెట్టింగ్‌రాయుళ్ళంతా నగదును కట్టలు కట్టలుగా తెచ్చి బెట్టింగు ను కాశారు. తగినంత భద్రత తీసుకున్నారు. మొత్తం నగదును నలుగురైదుగురికి విభజించి అందుబాటులో ఉంచుకున్నారు. హైదరాబాదు నుంచి వచ్చిన వ్యాపార వేత్త రూ.50 లక్షల నగదును సంక్రాంతి ఒక్కరోజునే కోడి పందేల్లో బెట్టింగ్‌గా కాశారు. లండన్ నుంచి వచ్చిన అతిథి ఒకరు తన అదృష్ట సంఖ్య తొమ్మిదితో తొమ్మిది లక్షలు కాసి గెలుపొందడం విశేషం. రాయచోటి నుంచి వచ్చిన వరలక్ష్మి అనే మహిళ మూడు పందేల్లో రూ.11 లక్షలు పందెంగా కాశారు. ఇలా ఎక్కడికక్కడ నగదు విచ్చలవిడిగానే సాగింది. ఇక కోతాట విషయానికొస్తే చెప్పనక్కర్లేదు. ప్రతీ పందెం బరిలోను కోతాట ఒక్కో రోజు 35 లక్షల నుంచి 45 లక్షల మేర సాగాయి. జిల్లా మొత్తం మీద ఒక్క కోడి పందేల్లోనే రూ.60 నుంచి రూ.90 కోట్లు చేతులు మారగా, అదే పేకాటలో అయితే అంతే మొత్తం జోరుగా సాగిందని అంచనా. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం సొమ్ము మూడు రెట్లు అధికం. ఇక గుండాట విషయంలో చెప్పనక్కర్లేదు.

తెగ తాగేశారు..

ఏలూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం బ్రాండ్‌లను సంక్రాంతి కానుక గా అందివ్వడంతో మద్యంబాబులు తెగతేశారు. భోగి నుంచి కనుమ వరకు అమ్మకాలు రూ.15 కోట్ల దాటి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్క బుధవారమే రూ.8 కోట్లు పైనే అమ్మకాలు జరిగాయి. జిల్లాలోని 141 షాపుల ద్వారా భోగి రోజు 13వ తేదీన రూ.10 కోట్లు, 14న సంక్రాంతి రోజున రూ.7 కోట్లు, కనుమ రోజు ఉదయం ఒక రూ.కోటి వరకు సరుకును ఏలూరు డిపో నుంచి వైన్‌షాపుల యజమానులు లిఫ్ట్ చేసుకు న్నారు. కాగా డిపోకు అధికారికంగా బుధవారం సెలవు కావడంతో కొంత స్టాకును యజమానులు తీసుకెళ్లలేకపోయారు. గతేడాది జనవరిలో 1.37 లక్షల కేసుల మద్యం అమ్మకాలు సాగగా, ఈ ఏడాదిలో ఇప్పటికే 76 వేల 250 కేసుల మద్యం అమ్మకాలు చేశారు. రోజుకు ఐదు వేల కేసుల మద్యం అమ్మ కాలు సగటున జరుగుతున్నాయి. ఈ లెక్కన మిగిలిన 15 రోజుల్లో 1.50 లక్షల కేసుల మద్యం అమ్మడం ఖాయంగా కనిపిస్తోంది. గురువారం మరో రూ.10 కోట్ల పైనే స్టాకును తరలించుకునే అవకాశం ఉంది.


ఏలూరులోని చొదిమెళ్ళ బరి వద్ద విక్రయానికి సిద్ధంగా మద్యం

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ఏలూరుసిటీ : జిల్లాలో వాడవాడలా సంక్రాంతి సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించగా కనుమ వేడుకలను బుధవారం వేడుకగా జరిపారు. సంక్రాంతి పురస్కరించుకుని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కనుమ పండుగను జిల్లా వ్యాప్తంగా రైతులు వైభవంగా నిర్వహించు కున్నారు. వరి కంకులను తోరణాల్లా ఇంటికి కట్టి గోమాతను పూజించారు. జిల్లాలో ఎక్కడ చూసినా మూడు రోజుల పాటు సంక్రాంతి సందడే కనిపించింది.


ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలో గోపూజ



బరి వద్దే విందు భోజనం

పెదవేగి : సంక్రాంతిని పురస్కరించుకుని పెదవేగి మం డలం దుగ్గిరాలలో కోడి పందేలు భారీగా సాగాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రతిరోజు చికెన్, మటన్, రొయ్యల బిర్యానీలతో ఉచిత భోజనం ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల్లో దాదాపు 75 వేల మందికి ఉచిత భోజనం అందించారు. వీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేసి, అతిథి మర్యాదలతో ఆకట్టుకున్నారు.



కోజా... భలే డిమాండ్..

ద్వారకాతిరుమల/కొయ్యలగూడెం : పందెంలో ఓడిపోయి చనిపోయిన కోడిని కోజాగా పిలుస్తారు. పందేలకు ముందు పందె గాళ్ల వీటికి బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా, కైమా వంటి ఆహారాన్ని అందిస్తారు. దీనివల్ల మంచి రుచి వస్తుందని వీటికోసం మాంసం ప్రియులు ఎగబడుతుంటారు. ఒక్కో కోజా రూ. 3000 నుంచి రూ.10 వేల వరకు పలికింది. ఏలూరు శివారులో రూ.15 వేలు పలకడం విశేషం.

ఫోన్ పే, గూగుల్ పేలో పందేల సొమ్ము

బుట్టాయగూడెం : ఎన్నడూలేని విధంగా ఈసారి కోడిపందేల్లో ఫోన్ పే, గూగుల్ పేలకు డిమాండ్ పెరిగింది. చేతిలో డబ్బులు లేకపోవడంతో పందేలరాయుళ్ళు ఫోన్ పే, గూగుల్ పేలకు పని చెప్పారు. సంక్రాంతి పండుగ రోజుల్లో బ్యాంకులకు సెలవు కావడం, ఏటీఎంలు ఖాళీ కావడంతో డబ్బులకు ఎక్కలేని డిమాండ్ వచ్చింది. చాలామంది దగ్గర నగదు రూపంలో లేకపోవడంతో ఫోన్ పే, గూగుల్ పే లతో కోడిపందేలు కాశారు. కొందరు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తే పది శాతం కమిషన్ తీసుకుని నోట్ల రూపంలో తిరిగి డబ్బులు ఇచ్చారు. రూ.వెయ్యికి రూ.100 కమిషన్‌తో లావాదేవీలు జరిగాయి. ప్రత్యేకించి కొందరి మధ్య అయితే బెట్టింగు లన్నీ ఫోన్‌పే టూ ఫోన్‌పే పద్ధతిలో సాగాయి. కొందరు ఈ-బ్యాంకింగ్ పద్ధతిని పాటించారు.

371 కేసులు నమోదు

ఏలూరు క్రైం : జిల్లాలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో 371 కేసులు నమోదు చేసి 891 మందిని అరెస్టు చేశారు. 13న 92 కోడిపందేల కేసులు, 52 పేకాట, 27 గుండాట కేసులు నమోదు చేశారు. మొత్తం 171 కేసుల్లో 411 మందిని అరెస్టు చేసి రూ.రెండు లక్షల 55 వేల 440 నగదు, 114 కోళ్ళు, 150 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. 14న 99 కోడి పందేల కేసులు, 65 జూదం, 36 గుండాట కేసులు మొత్తం 200 కేసులు నమోదు చేసి 480 మందిని అరెస్టు చేసి 115 కోళ్ళు, 116 కోడికత్తులు, రూ.మూడు లక్షల 20 వేల 755 నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో జరిగిన కోడిపందేల్లో రూ.500 దొంగనోట్లు చెక్కర్లు కొట్టాయని చెప్పుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో గంజాయి విక్రయించినట్లుగా తెలుస్తోంది. కోడిపందేలను ప్రధాన రహదారుల పక్కనే నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఏలూరు రూరల్ మండలం కొమడవోలు, పాలగూడెం, చాటపర్రురోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొమడవోలులో ట్రాఫిక్ జామ్ అయి ఒక ఆటో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న పంట కాల్వలో బోల్తా పడింది. బొర్రంపాలెం అడ్డరోడ్డు వద్ద ఒక పామాయిల్ తోటలో రోడ్డు పక్కనే పందేలు నిర్వహించడంతో, వాహనా లు రోడ్లపైనే పెట్టివేయడంతో తీవ్ర అంతరాయం ఏర్పడింది.


చొదిమెళ్ళలో కోతాట

ఇక కొత్తగా..

- ఐదు పాఠశాలల వ్యవస్థతో మేలు
- జగన్ ప్రభుత్వ విధ్వంసకర విద్యావిధానం నుంచి ఉపశమనం
- పంచాయతీలవారీగా ప్రతిపాదనలకు తుదిరూపునిస్తోన్న విద్యాశాఖ
- 21న ఏలూరులో ఉమ్మడి జిల్లా విద్యాధికారులతో సమావేశం

ఏలూరు అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిపాదించిన ఐదురకాల పాఠశాలల వ్యవస్థ.. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలో పేతం చేసేందుకు ఓ టానిక్‌లా పనిచేస్తుందని భావి స్తున్నారు. సంస్కరణల మాటున జగన్ ప్రభుత్వం తీసుకున్న దుందుడుకు చర్యలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు నీరుగారిపోయాయి. కిలోమీటర్ల దూరం లోని హైస్కూళ్లలోకి 3,4,5 తరగతులను విలీనం చేయడంతో వేల సంఖ్యలో విద్యార్థులకు స్థానికంగా చదువుకునే అవకాశం లేకుండా పోయిందనే అభ్యం తరాలను సైతం వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 1,2 తరగతుల బాల లకే పరిమితంకాగా, దీనినే సాకుగా తీసుకుని ఉపా ధ్యాయులను బలవంతంగానే ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసింది. గత రెండేళ్లలో ప్రాథమిక పాఠ శాలలు చాలావరకు తగినంతమంది విద్యార్థులు లేక మూతపడే పరిస్థితులు వచ్చాయి. పలు పాఠశాలల్లో సింగిల్ డిజిట్‌కు విద్యార్థులసంఖ్య పడిపోయింది. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రతిపాదించిన ఐదురకాల పాఠ శాలల విధానంతో ప్రాథమిక పాఠశాలలకు మళ్లీ పూర్వవైభవం సంతరించుకునే మంచిరోజుల వచ్చా యని చెప్పవచ్చు. కొత్త పాఠశాలల విధానం ప్రకారం ప్రీప్రైమరీ - 1, ప్రీ ప్రైమరీ - 2 (ఎల్‌కేజీ, యూకేజీ) తరగతులతో శాటిలైట్ ప్రైమరీ స్కూళ్లు, ఈ రెండు తరగతులకు అదనంగా 1, 2 తరగతులను జోడిస్తూ ఫౌండేషన్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా క్లస్టర్‌ను ప్రామా ణికంగా తీసుకుని ప్రతీ పంచాయతీలో అన్ని మౌలిక సదుపాయాలతో ఒక్కొక్కటి చొప్పున మోడల్ ప్రైమరీ స్కూళ్లను ప్రారంభించాలని ప్రతిపాదించింది. గత వైసీపీ ప్రభుత్వం హైస్కూళ్లకు తరలించిన 3,4,5 తర గతులను ఈ మోడల్ ప్రైమరీ స్కూళ్లలోకి వెనక్కి తీసుకొచ్చి పూర్వపువిధానంలో ఉన్నట్టుగానే మొత్తం ఐదు తరగతులతో నిర్వహిస్తారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 120 దాటితే ఐదుగురు టీచర్లను ఇవ్వనుండడంతో ఒక హెచ్‌ఎం, ప్రతీ తరగతికి ఒక టీచరు ఉండడంతో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెరగడంతోపాటు, ఉపాధ్యాయులకు సైతం ఉప యుక్తంగా ఉంటుందని భావిస్తున్నారు. ఒకవేళ ఈ పాఠశాలల్లో బాల బాలికల సంఖ్య 31 నుంచి 59 వరకు ఉంటే ఐదు తరగతులనే కొనసాగిస్తూ అక్కడ ఎస్జీటీలతో బోధించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనివల్ల ఎస్జీటీల్లో మిగులు (సర్‌ప్లస్) సమస్యలు తలెత్తే అవకాశాలు ఉండక పోవచ్చని చెబుతున్నారు. ఇక ప్రాథమికోన్నత (అప్పర్ ప్రైమరీ) పాఠశాలల్లో చాలాచోట్ల విద్యార్థుల సంఖ్య సంతృప్తికరంగా లేదని గుర్తించిన ప్రభుత్వం ప్రతిపాదిత ఐదురకాల పాఠశాలల విధానంలో వాటిని సంస్కరించే ప్రయత్నం చేసింది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 60కి మించి విద్యార్థులుంటే వాటిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడం, 30 కంటే తక్కువ ఉంటే ప్రాథమిక పాఠశాలగా మార్చడం వంటి చర్యలు చేపట్టడానికి యోచిస్తున్నారు.

ఉన్నత పాఠశాలలకు మహర్దశ

ప్రాథమిక తరగతులు, పై తరగతుల విద్యార్థులను ఒకేచోటకు చేర్చి బోధనను చేపట్టి జగన్ ప్రభుత్వం ప్రైమరీ, హైస్కూల్ పిల్లల దృక్పథాన్ని అశాస్త్రీయంగా ఒకేగాటన చేర్చి గందరగోళానికి తావిచ్చింది. తాజా విధానంలో హైస్కూలుకు కేటాయించిన 6 నుంచి 10 వరకు తరగతులనే మళ్లీ ప్రవేశ పెట్టడం వల్ల పలు ప్రయోజనాలుంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. హైస్కూలులో విద్యా ర్థుల సంఖ్య 75 దాటితే హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను అదనంగా మంజూరు చేస్తారు. ఆ పైన విద్యార్థుల సంఖ్య 54 దాటితే రెండు సెక్షన్లు, ప్రతీ 10 సెక్షన్లకు హిందీ, ఫిజికల్ సైన్స్ టీచరుపోస్టు అదనంగా మంజూరు చేయడానికి నూతనవిధానం అవకాశం కల్పిస్తోంది.

మోడల్ ప్రైమరీ స్కూల్స్‌తో నాణ్యత గల విద్య



తరగతికో టీచరు పోస్టువల్ల మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుతో క్వాలిటీ ఎడ్యుకేషన్ పెరుగుతుం ది. హైస్కూళ్లలో గతంలో ప్రతీ పదిసెక్షన్లకు మొత్తం 13 మంది టీచర్లను ఇచ్చేవారు. కొత్తవిధానంలో టీచర్ల సంఖ్య 15కి పెరుగుతుంది. ఐదురకాల పాఠశాలల విధానం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగడానికి దారితీస్తుంది.

- వెంకటలక్ష్మమ్మ, డీఈవో

21న ఉమ్మడి జిల్లా సమావేశం



మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు సన్నాహాలు, బేసిక్ ప్రాథమిక పాఠశాలల గుర్తింపు పారదర్శకంగా జరుగుతోంది. క్లస్టర్లు, మండలస్థాయిల్లో కమి టీలు ఏర్పాటు చేశాం. ఈనెల 17న, 19న నిర్వహిం చే సమావేశాల్లో చిత్తుప్రతి (రఫ్‌కాపీ)ని సిద్ధం చేస్తాం. దీనిపై తుదిరూపునిచ్చేందుకు ఉమ్మడి పశ్చిమలోని క్లస్టర్ల హెచ్‌ఎంలు, ఎంఈవోలతో ఈనెల 21న ఏలూరులో పాఠశాలవిద్య డైరెక్టర్ విజయరామరాజు సమావేశం నిర్వంచనున్నారు. క్షేత్రస్థాయిలో అభ్యంతరాలు, సందేహాలుంటే నివృత్తిచేసి ఐదురకాల పాఠశాలల ఏర్పాటుపై ఓ నిర్ణయానికి వస్తారు.

- సర్వేశ్వరరావు, నూతన పాఠశాలల జిల్లా నోడల్ ఆఫీసర్

కొల్లేరు పర్యాటకాభివృద్ధికి కృషి : మంత్రి నాదెండ్ల


కొల్లేరు మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల..

ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరులో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఏలూరు రూరల్ మండలంలోని మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పక్షుల కేంద్రంలోని కొల్లేరు మ్యాప్‌ను పరిశీలించారు. అభయారణ్యంలోని కాంటూరు పరిధిలో మండలాలు, కొల్లేరు విస్తీర్ణం తదితర వివ రాలను అడిగి తెలుసుకున్నారు. పక్షుల సంరక్షణకు తీసు కుంటున్న జాగ్రత్తలు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశా రు. బైనాక్యులర్‌లో పక్షులను తిలకించారు. పర్యావరణ పరిరక్షణ, తాగునీరు, పక్షుల సంరక్షణకు చేపడుతున్న చర్యలను అటవీశాఖ సిబ్బందితో చర్చించారు.

పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి

కైకలూరు : సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కొల్లేరు పక్షులకేంద్రానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. బుధవారం కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం ఎటు చూసినా పర్యాటకులతో కిటకిట లాడింది. బోట్లలో షికారు చేస్తూ అత్యంత సమీపం నుంచి పక్షులను తిల కిస్తూ ఆనందించారు. అటవీశాఖ అధికారులు పర్యాటకుల నీడ కోసం టెంట్లు వేయించారు. రెండు మరబోట్లును ఉపయోగించి పర్యాటకులను సరస్సులోకి తీసుకువెళ్లారు. అటవీశాఖ రేంజర్ రామలింగాచారి, రంజిత్ పర్యవేక్షించారు.


ఆటపాక పక్షుల కేంద్రంలో పర్యాటకులు




గుర్రపు బగ్గీ, రిక్షాపై ప్రయాణం



బొమ్మ ఎద్దుల ఆటోలో చిన్నారులు



బొమ్మ ఎద్దుల బండి



తాడేరులో కోడి బొమ్మ



సంక్రాంతి.. సంప్రదాయం

సంక్రాంతి పండుగ సంప్రదాయానికి ప్రతీక. ఉపాధి, ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి వేడుకలకు స్వగ్రామాలకు చేరుకుని సందడి చేశారు. పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాల్లో పాత కాలం నాటి ప్రయాణ సౌకర్యాలను ఈతరం వారికి తెలియజెప్పే ప్రయత్నం చేశారు. వీరవాసరం మండలం నవుడూరు శివారులో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. గ్రామీణ ప్రాంతాన్ని తలపించేవిధంగా రూపొందించిన సెట్టింగ్‌లు, కోడి పుంజులు ఆకట్టుకున్నాయి. ఎడ్లబండి, గుర్రపు బండి, పాత కాలం నాటి కార్లు ప్రదర్శనకు ఉంచారు. వేడుకలకు వచ్చిన వారికి వాటిలో ఉచితంగా ప్రయాణించే అవకాశం కూడా కల్పించారు. పిల్లలు, పెద్దలు వాటిలో ప్రయాణించి కేరింతలు కొట్టారు. యలమంచిలి బొమ్మ ఎడ్లబండ్లు ఫొటో షూట్ ప్రాంతాలు ఆకట్టుకున్నాయి. పలుచోట్ల సంప్రదాయ పిండివంటలతో భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. భీమవరంలో మండలంలో భారీ సైజు కోడి పుంజు బొమ్మ చిన్న పిల్లలను విశేషంగా ఆకర్షించింది. గతంలో ఎక్కడా ఇటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో గ్రామాల్లో సరదగా గడిపారు.

(భీమవరం టౌన్ / భీమవరం రూరల్ / యలమంచిలి / వీరవాసరం, ఆంధ్రజ్యోతి)



ఆ తరం కారులో ప్రయాణం



ఎడ్ల బండిపై అల్లుళ్ల రాక



చిన్న ఎద్ద బండిపై సవారీ

గోదావరి మర్యాదలు..!

కొత్త అల్లుళ్లకు పసందైన వంటకాలతో పండుగ విందు

452 రకాల వంటకాలు



సంక్రాంతి పండుగ కొత్త అల్లుళ్లకు మరీ ప్రత్యేకం. అత్తమామల మర్యాదలతో అల్లుడు ఉబ్బితబ్బిబ్బు కావాలిసిందే. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వందనపు వెంకటేశ్వరరావు, సాయి బాల పద్మ దంపతులు తమ అల్లుడు, కుమార్తె కొల్లూరు శివ భాస్కర్, ప్రియాంకకు పసందైన పండుగ విందు ఏర్పాటు చేశారు. 452 రకాల భోజన పదార్థాలతో నూతన దంపతులతో పాటు బంధువులందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. **- ఏలూరు, ఆంధ్రజ్యోతి**

365 రకాలు



జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన తడికమళ్ళ దుర్గారావు, జ్యోతి దంపతుల అల్లుడు భరత్‌సాయి, కుమార్తె అమృత భవ్యశ్రీకి రోజుకో రకం వంటకం అంటూ మర్యాదలు చేశారు. 365 రకాల పదార్థాలతో విందు ఏర్పాటు చేశారు. **- ఏలూరు, ఆంధ్రజ్యోతి**

200 రకాలు



మొగల్తూరుకు చెందిన అనంత పల్లి ఫణి, ఝాన్సీ దంపతులు చిన్న కుమార్తె విష్ణుప్రియ అల్లుడు త్రిపుర మల్లు వైష్ణవ్‌కు 200 రకాల వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. వారితో పాటు పెద్ద కుమార్తె లక్ష్మీ హరిప్రియ, వినయ్ రాజ్‌కుమార్ దంపతులను ముందుగా గ్రామంలోకి ఎడ్లబండిపై ఇంటికి తీసుకెళ్లారు.

- మొగల్తూరు, ఆంధ్రజ్యోతి

174 రకాలు



ఆకివీడుకు చెందిన పేరూరి రాధాకృష్ణ, రాజ్యం దంపతులు అల్లుడికి 174 రకాల వంటకాలతో విందు రుచి చూపించారు. పెద్ద బల్లపై అరిటాకు, వెండి పళ్లెంలో ఆహార పదార్థాలు కొసరి కొసరి వడ్డించారు. అత్తారింట మర్యాదలు చూసిన అల్లుడు రాహుల్ పొంగిపోయాడు.

- ఆకివీడు, ఆంధ్రజ్యోతి



ఆచంట మండలం పెనుమంచిలి, కందరవల్లి మధ్య ప్రభల తీర్థం

వైభవంగా ప్రభల తీర్థం

ఆచంట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుమంచిలి, కందరవల్లి సరిహద్దు ప్రాంతంలో పచ్చని పొలాల మధ్య బుధవారం ప్రభల తీర్థం వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగలో కనుమ రోజు వల్లూరు, కరుగోరుమిల్లి, కోడేరు, పెనుమంచిలి, కందరవల్లి ఆలయాల నుంచి ఊరేగింపు వచ్చిన ప్రభలు అక్కడ కొలువుదీరుతాయి. ఆచంట పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున ప్రభల తీర్థానికి తరలివస్తారు. స్వామి వార్లకు పూజలు చేస్తారు. ఆయా గ్రామాల నుంచి ప్రభలు వరి చేలు, కాలువల్లో నుంచి ఊరేగింపు తరలి రావడాన్ని ప్రజలు సంభ్రమాశ్చర్యాలతో తిలకిస్తారు. కొద్ది గంటల సేపు జరిగి వేడుక ఆధ్యాత్మిక శోభకు అద్దం పడుతుంది. ఎస్‌ఐ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మూడు తరాల హీరోలతో నటించా



చిట్టిబాబుతో చిట్‌చాట్

సంక్రాంతి వేడుకల్లో బంధువుల పలకరింపులు, విందు, వినోదాలు, సంప్రదాయాలు సంతృప్తినిచ్చాయి. స్వస్థలం అమలాపురం అయినా ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిజాంపేటలో స్థిరపడ్డా. సంక్రాంతిని పశ్చిమలో ఆనందంగా గడపడం తనకు మరువలేని జ్ఞాపకమని హాస్యనటుడు పుణ్యమూర్తుల సూర్యనారాయణమూర్తి (చిట్టిబాబు) అన్నారు. వాలమూరు జాతరలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను ఆంధ్రజ్యోతి పలకరించింది.

● సినీ ప్రస్థానం ఎలా సాగుతోంది..?

సినీ పరిశ్రమలో మూడు తరాల హీరోలతో నటించా. అక్కినేని నాగేశ్వరరావు ఆయన కుమారుడు నాగార్జున, ఆయన కుమారుడు అఖిల్‌తో నటించా. ఎన్‌టీఆర్‌తో నటించా. ఆయన కుమారుడు బాలకృష్ణ, ఎన్‌టీఆర్ మనవడు జూనియర్ ఎన్‌టీఆర్‌తో కూడా నటించాను. దర్శకుడు రాఘవేంద్రరావు తండ్రి కెఎస్‌ప్రకాశరావు దర్శకత్వం, రాఘవేంద్రరావు దర్శకత్వం, ఆయన కుమారుడు ప్రకాష్ దర్శకత్వంలో నటించా.

● మీ స్వస్థలం.. విద్యాభ్యాసం..?

పుట్టింది అమలాపురం. చదువు అంతా ద్రాక్షారామం, రామచంద్రాపురం, రాజమహేంద్రవరంలో సాగింది. ఐటీఐ ఎలక్ట్రికల్ చదివా. రాజమండ్రిలో అప్రెంటిస్ చేసి ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లిపోయా.

● నటనానుభవం..?

నాటకాల్లో వేషాలతో నటనానుభవం ఉంది. హైదరాబాద్‌లో సాయంత్రం కళాశాలల్లో పీయూసీ, డిగ్రీ పూర్తి చేశా. ఆసందర్భంలో నాటకాలు వేశా. ఆడది నాటకంలో ఉత్తమ హాస్యనటుడి అవార్డు, సాంస్కృతిక విభాగంలో బంగారు పతకం సాధించా.

● సినీ రంగ ప్రవేశం..?

మాఅన్నయ్య రాజబాబు నటించిన పల్లెటూరు బావ చిత్రం హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తున్నారు. ఆ చిత్రంలో మా అన్నయ్యకు బావమరిదిగా (రమాప్రభ తమ్ముడిగా) నటించారు. తరువాత మరపురాని మనిషి చిత్రంలో మా అన్నయ్యకు తమ్ముడుగా నటించాను.

● సినిమాల్లో హాస్యానికి ప్రాధాన్యం..?

పూర్వం హాస్యానికి ఎంతో ప్రాధాన్యం ఉండేది. సినిమాలో ఒక భాగం. హాస్య నటులు తప్పనిసరి. ఇప్పుడు హాస్య నటుల అవసరం తగ్గింది. ఫైటింగ్‌లు, పాటల ముందు హాస్య రసం చిన్నబోయింది. చిత్రంలో హీరోలే హాస్యం చేస్తున్నారు.

● సినిమాపై టీవీల ప్రభావం..?

పూర్వం కొత్త అల్లుళ్లు వచ్చినా, పండగల్లో అందరూ కలిసి సినిమాలకు వెళ్లేవారు. టీవీ రాకతో థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోతోంది. టీవీ సినిమా రంగాన్ని తెలియని దెబ్బతీసిందని చెప్పవచ్చు. ఇప్పుడు స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్ల ప్రభావం ఉంది.

భీమవరం టౌన్, ఆంధ్రజ్యోతి




పార్వేటి ఉత్సవానికి ఉభయదేవేరులతో బయలుదేరిన శ్రీవారు, స్వామి అమ్మవార్లకు పూజలు

నయనానందకరం.. పార్వేటి ఉత్సవం



భక్తులకు గజలక్ష్మి ఆశీర్వాదం



ఊరేగింపులో అలరించిన వేషధారణలు

ద్వారకాతిరుమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్నకు పార్వేటి మహోత్సవం (కనుమ ఉత్సవం) బుధవారం కనుల పండువగా జరిగింది. ఆలయంలో ఉభయదేవేరులతో శ్రీవారిని రాజాధిరాజ వాహనంపై ఉంచి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా గజ, అశ్వ వాహనాలపై పురవీధులకు పయనమయ్యారు. తిరువీధుల్లో దర్శనమిచ్చిన శ్రీవారు దొరసానిపాడు గ్రామానికి తరలివెళ్లారు. కనుమ మండపంలో ప్రత్యేక వేదికపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవారు గిరిప్రదక్షిణగా శేషాచలకొండ మార్గంలో ఆలయానికి చేరుకున్నారు. ఈ ఉత్సవం ఆద్యంతం భక్తులను పరవశింపజేసింది.





మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో విద్యుత్ కాంతులు, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన మావుళ్లమ్మ ఆలయం

భీమవరం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చిన ప్రజలు అమ్మవారిని అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు. శ్రీనివాస కూచిపూడి నృత్య నికేతన్ బృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన సినీ కొరియాగ్రాఫర్, కూచిపూడి బృందం నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఉత్సవ ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలను ఆలయ ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేశ్ పర్యవేక్షించారు. వన్‌టౌన్ సిఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.



మావుళ్లమ్మ ఉత్సవాల్లో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

లేడీ బౌన్సర్ల హల్‌చల్




సినిమా ఫంక్షన్ కాదు.. నటుల సందడి లేదు.. సెలబ్రిటీలు లేరు. అక్కడంతా జన సందోహం. అదంతా కోడిపందేలు జోరు. జనం రద్దీతో పందేలకు ఆటంకం లేకుండా బౌన్సర్లు ఉన్నారు. వారిలో బౌన్సర్లు ఉండడమే విశేషం. తాడేపల్లిగూడెం ప్రాంతంలో లేడి బౌన్సర్‌ల ఏర్పాటు చర్చనీయాంశమైంది. **- తాడేపల్లిగూడెం రూరల్, ఆంధ్రజ్యోతి**

ఉత్సాహంగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీవేద, కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆర్డీవో దాసి రాజు

నరసాపురం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుస్తుంబాదా కబడ్డీ స్టేడియంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను డీఎస్పీ శ్రీవేద, ఆర్డీవో దాసిరాజు ప్రారంభించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి స్టేడియం వరకు క్రీడాకారులు ర్యాలీ చేశారు. మంగళవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ దాతలు ముందుకు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారుల్ని తయారుచేసిన ఘనత రుస్తుంబాదా స్టేడియంకు దక్కిందన్నారు. డీఎస్పీ శ్రీవేద మాట్లాడుతూ 30ఏళ్లుగా జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పురుషుల విభాగంలో 19, మహిళల విభాగంలో 11 జట్లు తలపడుతున్నాయి. లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న పోటీల్లో బుధవారం మహిళ విభాగంలో వెస్ట్ బెంగాల్‌పై హర్యానా జట్టు, పురుషుల విభాగంలో వెస్ట్ బెంగాల్‌పై ఆంధ్ర జట్టు గెలుపొందాయి. కన్వీనర్ జానకిరామ్, డీఈ మధుకుమార్, తహసీల్దార్ రాజరాజేశ్వరి, నెక్కంటి సుబ్బారావు, చినమిల్లి సత్యనారాయణ, అడబాల బాబులు, వైఎస్ బాబులు, వన్నెంరెడ్డి శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ టీమ్ చీఫ్‌గా బడేటి



ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, రిషికేష్, హరిద్వార్‌తో పాటు సుమారు 9 రాష్ట్రాల్లో ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వరకు జరిగే 38వ జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ టీమ్ చీఫ్‌గా బడేటి వెంకటరామయ్య నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయక్రీడల్లో పాల్గొనేందుకు మొత్తం 21 క్రీడాంశాలు అర్హత సాధించాయి. బడేటి వెంకటరామయ్య ప్రస్తుతం ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, ఏపీ ఒలంపిక్స్ సంఘం ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. 2010లో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడకు డిప్యూటీ కాంపిటిషన్ మేనేజరుగా గతంలో జరిగిన జాతీయక్రీడల్లో అనేక హోదాల్లో సేవలందించారు. ఏపీ టీమ్ చీఫ్‌గా ఎంపికైన వెంకటరామయ్యను ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ సభ్యులు, జిల్లా ఒలంపిక్ సభ్యులు, అనేక జిల్లాల క్రీడాసంఘాల ప్రతినిధులు, రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి డీన్‌బాబు అభినందించారు.


రామానుజపురం కోడి పందేల్లో కుమారుడితో కలిసి తిలకిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు


మలసానికుంట బరిలో కోడి పుంజును పట్టుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి


దుగ్గిరాలలో పందేలను తిలకిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తదితరులు


ఏలూరు రూరల్ జాలిపూడిలో కత్తి దువ్వుతున్న కోడి పుంజులు


దుగ్గిరాలలో ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, గంగుల కమలాకర్

కోడ్డే

- జోరుగా సాగిన కోడి పందేలు
- చేతులు మారిన కోట్లాది రూపాయలు
- ఏరులై పారిన మద్యం

ఏలూరు రూరల్/ఏలూరు క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలంలో కోడిపందేలు మూడోరోజు జోరుగా సాగాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు సైతం బరుల వద్దకు వచ్చి కోళ్ళను దువ్వి జోరును మరింత పెంచారు. కోడిపం దేలకు తోడు గుండాట, పేకాటలు నిర్వహిం చా రు. రూరల్ మండలం చొదిమెళ్ళ, కోడేలు, పాల గూడెం, చాటపర్రు, జాలిపూడి, గుడివాక లంక, పత్తికోళ్ళలంక, పైడిచింతపాడు, శ్రీపర్రు గ్రామా ల్లో సోమవారం ఉదయం నుంచే కోడి పందేల ను నిర్వహించారు. బరుల వద్ద మద్యం ఏరులైపారింది.

●టి.నరసాపురం/ఏలూరు/కొయ్యలగూడెం/జీలుగుమిల్లి/బుట్టాయగూడెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం మండలంలో టి.నరసాపురం, బందంచర్ల, తిరుమలదేవిపేట, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో మూడు రోజులుగా కోడి పందేలు నిర్వహించారు. పందేల బరుల వద్ద మద్యం ఏరులై పారుతోంది. పోలవరం మండ లంలో బుధవారం వరకు కోడి పందేలు జోరుగా కొనసాగాయి. సంక్రాంతి పండుగకు విచ్చేసిన సినీ నటులు శ్రవణ్, శ్రీనివాసరెడ్డిలకు ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికి శాలువాలు కప్పి సత్కరించారు. కొయ్యలగూడెం మండలంలో కోడి పందేలు కొనసాగాయి. రామానుజపురంలో పందేలు చూసేందుకు ఎమ్మెల్యే, ఎంపీలు పలువురు ప్రముఖులు వచ్చారు. రామానుజపురంలో ఎక్కువ పందేలు గెలుపొందిన వారికి మూడు బుల్లెట్ వాహనాలు అంద జేశారు. జీలుగుమిల్లి కోడి పందేల బరి ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో పాటు జబర్దస్త్ టీం సభ్యులు ఆటో రాంప్రసాద్, ఐశ్వర్య సందడి చేశారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలసి కొద్దిసేపు కోడి పందేలు వీక్షించారు. బుధవారం సాయంత్రం కోడి పందేల బరుల వద్ద పోలీసులు ప్రత్యక్షమయ్యారు. తాటియాకులగూడెంలో కోడి పందేల బరిని ఎస్‌ఐ వి.వినయ్‌కుమార్ సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు. పోలీసుల ఆదేశాలతో నిర్వాహకులు కోడి పందేలు నిలిపివేశారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు స్వగ్రామం బుట్టాయ గూడెం మండలం దుద్దుకూరు వద్ద ఏటా పందేలకు అధిక సంఖ్యలో జనాలు వచ్చేవారు. ఈ ఏడాది పట్టుమని వంద మంది కూడా లేకపోవడం గమనార్హం. జనసేన నాయకుడు ఏర్పాటు చేసిన కోడిపందేల బరి వద్ద, వైసీపీ నేత ఏర్పాటు చేసిన కంసాలికుంట బరి వద్ద పందేలు సాగాయి. సాయంత్రం ఐదు గంటల తర్వాత పోలీసుల రాకతో పందేలు నిలిపివేశారు. బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో జరిగి న కోడిపందేల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తె లంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి డింకీ పందేలు వేశారు.

● చింతలపూడి/లింగపాలెం/ కామవరపుకోట/జంగారెడ్డిగూడెం : చింతలపూడి మండలంలో మూడు రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడి పందేలు నిర్వహించారు. ఈ మండలం తెలంగాణ సరిహద్దులో ఉండడంతో రాఘవాపురం, చింతంపల్లి గ్రామాల్లో నిర్వహించిన పోటీలకు కార్లు, మోటారు సైకిళ్ళు వేసుకుని తరలివచ్చారు. లింగపాలెం మండలంలో కోడిపందేలు జోరుగా కొనసాగాయి. జిల్లాలోని పలుప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ నుంచి కూడా పందెంరాయుళ్లు తరలి వచ్చారు. మండలంలోని సింగగూడెం, కె.గోకవరం గ్రామాల్లో జరుగుతున్న కోడి పందేలను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఆయన వీక్షించారు. బుధవారం సాయంత్రం కలరాయనగూడెం, లింగపాలెం, కె.గోకవరం గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, గుండాట స్థావరాలపై దాడులు జరిపి ఐదుగురిని అరెస్టు చేసి, రూ.3,170 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ కె.వెంకన్న తెలిపారు. కామవరపు కోట మండలంలో కోడి పందేలు జరిగాయి. కొత్తూరులోని ఒక బరి వద్ద కోడి పందేల్లో ఘర్షణ నెలకొంది. పెద్దలు జోక్యంతో సద్దుమణిగింది. జంగారెడ్డిగూడెం మండలంలో కోడి పందేలు జోరుగా సాగాయి. శ్రీనివాసపురంలో వేసిన రెండు బరులు, జంగారెడ్డిగూడెంలో మూడు బరులు, వేగవరం, లక్కవరం, తాడువాయి, గురవాయిగూడెం, కేతవరంలలో కోడి పందేలలో భారీగా జరిగాయి. కోట్ల రూపాయలు చేతులు మారాయి. పేరంపేటలో ప్రారంభం రోజే ఓ వ్యక్తిని కొందరు కొట్టడంతో గాయపడిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడ పందేలను నిలిపివేశారు.

● ద్వారకాతిరుమల : కనుమ పండుగ రోజున సైతం పందెగాళ్లు మరింతగా రెచ్చిపోయారు. మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజులుగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడిపందేలు, జూదం, గుండాట, మద్యం, మాంసం విక్రయాలు యథేచ్ఛగా జరిపారు. మలసానికుంట గ్రామ కోడి పందేల బరిలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కోళ్లను పట్టుకుని బరిలో వదిలి సందడి చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యన్నారాయణ, మాచిరెడ్డి హరిబాబు, డీవీఎస్ చౌదరి, పాతూరి సహృదయ్, నాదెళ్ల వేణు పాల్గొన్నారు.

● ఉంగుటూరు/నిడమర్రు/భీమడోలు : ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో మూడు రోజుల పాటు యథేచ్ఛగా కోడి పందేలు, గుండాట సాగాయి. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. నిడమర్రు మండలంలోని తోకలపల్లి, పత్తేపురం, పెదనింద్రకొలను, బావాయిపాలెం, ఛానమిల్లి గ్రామాల్లో కోడి పందేలు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పందేలు సాగాయి. భీమడోలు మండలం గుండుగొలను, భీమడోలు, పూళ్ళ, కురెళ్ళగూడెం, అంబర్‌పేట, పోలసానపల్లి తదితర గ్రామాల్లో కోడిపందేలు, కోసాట, పేకాట వంటి జూదాలు కొనసాగాయి. కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు సమాచారం.

● కుక్కునూరు/వేలేరుపాడు : కుక్కునూరు మండలంలో మూడురోజుల పాటు జోరుగా కోడిపందేలు జరిగాయి. వేలేరు కోడి పందేల బరి తెలంగాణ సరిహద్దు కావడంతో అధిక సంఖ్యలో జనం విచ్చేశారు. వేలేరు, కుక్కునూరుల్లో భారీ ఎత్తున రూ. 50 లక్షల మధ్య పందేలు జరిగాయి. వేలేరు పాడు మండలంలో ఏర్పాటు చేసిన రెండు కోడి పందేల బరుల వద్ద మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి.

పెదవేగి/దెందులూరు: పెదవేగి మండలంలో మూడు రోజులపాటు కోడిపందేలు జోరుగా సాగాయి. పందేల్లో కోట్ల రూపాయలు చేతులు మారాయి. దుగ్గిరాలలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో కోడి పందేలు జరిగాయి. ఈ పందేలకు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై పందేలను తిలకించారు. పలువురు ప్రజాప్రతినిధులు, హైదరాబాద్, గోవా, బెంగళూరుతోపాటు విదేశాల నుంచి ప్రముఖులు పందేలకు తరలివచ్చారు. దెందులూరు మండలంలో పేకాట, కోడి పందేలు వేసిన 17 చోట్ల దాడి చేసి 17 కేసులు నమోదు చేయగా వాటిలో 29 మంది జూదరులను అరెస్టు చేశామని ఎస్‌ఐ శివాజీ అన్నారు. ఈ సందర్భంగా రూ.45 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పది కోడి కత్తులను సీజ్ చేశామన్నారు.

సంక్రాంతి సంబరాలు


చాటపర్రులో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహించారు. భోగితో ప్రారంభమైన ఆనందోత్సాహాలు రెండు, మూడోరోజు అయిన సంక్రాంతి, కనుమల్లో వెల్లువిరిశాయి. సంక్రాంతి సందర్భంగా మంగళవారం ఉదయాన్నే తలస్నానాలు చేసి పెద్దలకు పూజలు నిర్వహించారు. బుధవారం కనుమను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. పలుచోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఏలూరు రూరల్ మండలంలోని కనుమ పండుగ రోజున పశువుల పండుగ ఉత్సాహంగా నిర్వహించారు. ఎడ్లు, పశువులను శుభ్రం చేసి పూజలు చేశారు. చాటపర్రు గ్రామంలోని గీతాకాలనీలో సంక్రాంతి సంబరాలు బీకేఎంయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోణంగి గ్రామంలో వెలమ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం రాత్రి ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. 14వ డివిజన్ ఇన్‌చార్జి కె.సాంబశివరావు, నీటిసంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జనం లేక బోసిపోయిన ఫైర్‌స్టేషన్ సెంటర్

రోడ్లన్నీ నిర్మానుష్యం

- బోసిపోయిన జిల్లా కేంద్రం ఏలూరు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)జనవరి 15 : పల్లె, పట్నం అనే తేడా లేకుండా కోడి పందేల జోరును తిలకించేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లడంతో నగరం నిర్మానుష్యంగా మారిపోయింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు పెద్దగా రద్దీ లేకపోవడంతో బస్టాండ్, ఫైర్‌స్టేషన్ జిల్లా కేంద్రమైన ఏలూరు ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. కనుమ రోజున ఇంటిల్లి పాది పండుగ సంబరాలు.. పిండి వంటలు, నాన్ వెజ్ రుచుల ఆస్వాదనతో ఇళ్లకు పరిమితం కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి.రైళ్లు, బస్సుల్లో ప్రయాణాలు ఓ మోస్తరుగా సాగాయి.


బుట్టాయగూడెంలో కోడి పందేలు


జాలిపూడిలో కోడి పందేలు తిలకిస్తున్న యువకులు


కుక్కునూరులో కోడి పందేల బరి వద్ద కోడి పుంజుతో మహిళలు


పోలవరంలో సినీ నటులు శ్రవణ్ శ్రీనివాసరెడ్డితో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు


గణపవరం మండలం ఫత్తేపురంలో కోడి పందేలు వేస్తున్న దృశ్యం

పారిశ్రామికవాడగా తీర్చిదిద్దడమే లక్ష్యం : ఎంపీ మహేశ్

ఏలూరుటూటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అతిపెద్ద పారిశ్రామికవాడగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. ఎంపీ కార్యాలయంలో బెంగళూరుకు చెందిన హార్డీ గ్రీన్‌ఫుడ్స్ థాయిలాండ్ లిమిటెడ్ ప్రతినిధులు సుగుణప్రియ వెల్లంకి, బాబి పటేల్ ఆయనను కలిశారు. ఏలూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని ఎంపీని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు పూర్తి సహాయసహకారాలు అందిస్తా మన్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల మెగా ఇండస్ట్రియల్ హబ్ కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నారన్నారు. ఏలూరు పరిధిలో పరిశ్రమల ఏర్పాటు ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.


గ్రీన్‌ఫుడ్స్ థాయిలాండ్ ప్రతినిధులను కలిసిన ఎంపీ మహేశ్‌కుమార్


నారాయణపురంలో శతాధిక వృద్ధ దంపతులను ఆత్మీయ సత్కార దృశ్యం

శతాధిక వృద్ధ దంపతులకు సత్కారం

ఉంగుటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపురంలో విద్యాదాత శతాధిక వృద్ధ దంపతులు (102) అప్పసాని శేషగిరిరావు, కమలాదేవి దంపతులను గ్రామస్థులు, కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. గ్రామంలో విద్యావ్యాప్తికి కృషి చేయడంతో పాటు కళాశాల, హైస్కూలు అభివృద్ధికి చేసిన కృషికి గ్రామస్థులు సత్కరించారు. సంక్రాంతి సంబరాలో భాగంగా చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కుటుంబ సభ్యులు రవికుమార్, ఫణీంద్ర, సుబ్బలక్ష్మి, శశికళ, మాజీ సర్పంచ్ నాగమణి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు గోలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడులు

టి.నరసాపురం/ఏలూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడి పందేలు, పేకాట శిబిరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. అల్లంచర్లరాజుపాలెంలో పేకాట ఆడుతున్న ఇద్దరి వద్ద నుంచి రూ.1150 నగదు, వీరభద్రవరం గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ. 650 నగదు, కోడిపుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై జయబాబు తెలిపారు. అప్పలరాజుగూడెంలో గుండాట ఆడే ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.850 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశామని హెచ్‌సీ రాజు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో కోడి పందేలపై దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎస్.కె.జబీర్ తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

ఏలూరు క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఇంట్లో ఉన్న ఒక వృద్ధురాలి వద్దకు ఆగంతకుడు వచ్చి ఆమె కళ్ళల్లో కారం కొట్టి మెడలో బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు రోడ్డులోని అశ్వాని కాలనీకి చెందిన కొల్లిపర హేమలక్ష్మి సరసకుమారి అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉంటారు. ఈనెల 13వ తేదీ రాత్రి ఆమె టీవీ చూస్తుండగా ఒక ఆగంతకుడు అకస్మాత్తుగా ఇంట్లోకి వచ్చి ఆమె కళ్ళల్లో కారం కొట్టి ఆమె మెడలో ఉన్న ఐదు కాసుల బంగారు గొలుసును తెంపుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


నాటకంలో సన్నివేశం

అలరించిన సంక్రాంతి సాహిత్య ఉత్సవ సభ

ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురంలోని సాహిత్యమండలి ప్రాంగణంలో స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి సంబరాలు, సాహిత్య ఉత్సవ సభ విశేషంగా అలరించాయి. సంస్థ ఉపాధ్యక్షుడు కళారత్న కేవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, యువత వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కె.బ్రహ్మేశ్వరి సంక్రాంతి వైభవాన్ని వివరించారు. తొలుత గండికోట రాజేష్ శిష్యబృందం స్వాగతనృత్యం, చిన్నారుల కోలాటం అలరించాయి. ఈ సందర్భంగా చిరారు కొమ్మన మిఠాయిపొట్లం హాస్యనాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో కె.కెస్వామి, రామకృష్ణ, మజ్జి కాంతారావు ప్రసంగించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పుల్లాబోట్ల పురుషోత్తం పర్యవేక్షించారు.

ముగిసిన వేంగి క్రికెట్ టోర్నీ

ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):యువతను ప్రోత్సహించేందుకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వేంగి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఐదురోజుల పాటు జరిగిన పోటీల్లో సుమారు 20 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో ఇండోర్‌క్రేజీ ప్లేయర్స్, ఎమ్ఎస్‌డి జట్టు తలపడ్డాయి. ఈ పోటీలో ఎంఎస్‌డీ జట్టు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. విజేతలకు ట్రోఫీతో పాటు రూ.20వేలు నగదు బహుమతిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ చేతుల మీదుగా అందించారు.

వీరయ్య విగ్రహం ఆవిష్కరణ

ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కర్ణభక్తుల సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సెలాకోటి వీరయ్య విగ్రహావిష్కరణ, పెదవేగి మండలం దిబ్బగూడెంలో కుటుంబ సభ్యుల చేతులమీదుగా కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికా రాణి ఉడయార్ విగ్రహం తయారు చేశారు. వీరయ్య సోదరులు సెలా రాజాబాబు, కృష్ణారావు, మోహన్, సాయివంశీ, దువ్వి రామారావు, డి.హేమసుందర్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాలలో రాణించాలి : ఎమ్మెల్యే రోషన్

లింగపాలెం/చింతలపూడి జనవరి 15, ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాలలో రాణించాలని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గంలో మండలాల వారీగా మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. మహిళలు వారి ఇళ్ల వద్దే వేసిన ముగ్గులను వాట్సాప్ నంబర్లకు పంపే విధంగా ఏర్పాట్లు చేసి వాటిలో అందమైన ముగ్గులు వేసిన ముగ్గురిని ఎంపికచేసి బహుమతులు అందజేశారు. లింగపాలెం మండలంలో ప్రథమ బహుమతి దాదినబోయిన వాణి, మఠంగూడెం, ద్వితీయ బహుమతి పొలవర్తి పుష్పకుమారి, తృతీయ బహుమతి సొంగా రోజా, రంగాపురంలకు, చింతలపూడి మండలంలో ఘంటా వారివీధిలో ఎంపికైన జల్లపల్లి ముత్తేశ్వరరావు ఇంటికి వెళ్ళి బహుమతి అందించారు. బోయగూడెంలో ఒక యువతి బహుమతి గెలుచుకోగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి బహుమతులు అందజేసి పండుగరోజు వారి కుటుంబసభ్యులతో గడిపారు.


మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దంపతులు

బావాయిపాలెంలో పుంతలో ముసలమ్మ జాతర

నిడమర్రు జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : బావాయిపాలెం గ్రామదేవత పుంతలో ముసలమ్మ జాతర వైభవంగా బుధవారం ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం సుందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు ఉదయం గ్రామ పెద్దలు, ఉత్సవకమిటీ వారు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి జాతర ఉత్సవాలను ప్రారంభించారు. బావాయిపాలెం, ఛానమిల్లి, సిద్ధాపురం, క్రొవ్విడి, గణపవరం గ్రామాలకు చెందిన ప్రజలు పుంతలో ముసలమ్మ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ముత్యాల పెదబాబు, ముత్యాల రాము, ముత్యాల కాశీ, మాత్యాల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం ఖననానికి అడ్డగింత.. అధికారుల జోక్యం

ఏలూరు క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఒక సంఘానికి చెందిన క్రైస్తవుడి మృతితో మరో సంఘానికి చెందిన కొందరు అతని ఖననాన్ని అడ్డుకున్న ఘటన ఏలూరులో జరిగింది. ఏలూరు నగరంలో వట్లూరు ప్రాంతానికి చెందిన కర్నే రంగారావు(62) కొన్నేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. అతని కుమారుడు రమేష్ పాల్ కొంత కాలం క్రితం సొంతంగా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని క్రైస్తవ బోధకుడిగా మారాడు. తన తండ్రి మృతితో తన ఇంటి సమీపంలోని వట్లూరు క్రైస్తవ శ్మశాన వాటికలో ఆయనను ఖననం చేసేందుకు తీసుకువెళుతున్న సమయంలో అక్కడే నివాసం ఉంటున్న మరో సంఘానికి చెందిన క్రైస్తవులు అడ్డుకున్నారు. ఈ సమాధుల తోట తమ సంఘానికి చెందినదేనని వేరొక సంఘం వారిని ఇక్కడ ఖననం చేయరాదని చెప్పారు. దీనిపై రమేష్ పాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తహసీల్దార్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఈ శ్మశాన వాటిక క్రైస్తవుల సమాధుల తోటకు కేటాయించినదేనని ఒక సంఘానికి చెందినది కాదని తేల్చి చెప్పడంతో రంగారావుకు మూడో పట్టణ సీఐ కోటేశ్వరరావు సమక్షంలో ఖననాన్ని పూర్తి చేశారు. దీంతో ఘర్షణ కాస్త సద్దుమనిగింది.

ఘనంగా సాహిత్య కళా పురస్కారాల ప్రదానం

ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం 5వ వార్షికోత్సవాన్ని సాహిత్య మండలి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సాహిత్య కళారంగాల్లో విశేష కృషి చేసిన ప్రతిభామూర్తులకు 2025 సాహిత్య కళా పురస్కారాలు అందచేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు విచ్చేసి మాట్లాడారు. ఏలూరుకు చెంది పలు రంగాల్లో కృషిచేసిన గత తరానికి చెందిన ప్రముఖుల పేరుమీదుగా నేటితరంలో అదేరంగంలో కృషిచేస్తున్న ప్రముఖులకు పురస్కారాలు ఇవ్వడం ద్వారా గత తరానికి, నేటితరానికి మధ్య సాంస్కృతిక వారధిని నిర్మించి భవిష్యత్ తరాలకు సాహిత్య, సంగీత, నాట్యకళారంగాల వారసత్వాన్ని అందించవచ్చని అన్నారు. గురు సహస్రావధాని కడిమెళ్ళ వరప్రసాద్, విశిష్ట అతిథి రసరాజు, తెలుగు అధ్యాపకులు ఎస్.గోపాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా మణిమేల శివశంకర్‌కు కావలి బొర్రయ్య స్మారక పురస్కారం, కె.ఎన్ మల్లీశ్వరికి బుచ్చిబాబు స్మారక నవలా పురస్కారం, ఉపాధ్యాయులు రామారావుకు బొడ్డు బాపిరాజు పురస్కారం, పార్వతి రామచంద్రన్‌కు కోరాడ నరసింహారావు పురస్కారాన్ని అందించి ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. లేళ్ళ వెంకటేశ్వరరావు, నాగాస్త్ర, కేవీ సత్యనారాయణ, బీవీవీ ప్రసాద్, ఎమ్డీ ఖాజావలీ, పెదపాటి రామకృష్ణ, పుల్లాబోట్ల పురుషోత్తం పాల్గొన్నారు.

క్రైం సమాచారం

డ్రెయిన్‌లో పడి ఒకరి మృతి

కామవరపుకోట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి అతిగా మద్యం సేవించి డ్రెయిన్ పక్కన కూర్చుని ప్రమాదవశాత్తు డ్రెయిన్‌లో పడి మృతి చెందిన ఘటన కామ కొత్తూరులో జరిగింది. తడికలపూడి ఎస్‌ఐ చెన్నారావు తెలిపిన వివరాలివి.. కొత్తూరు బత్రాజుకాలనీకి చెందిన నందూరి ప్రసాద్ (48) కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. పండుగ సందర్భంగా అతిగా మద్యం తాగి డ్రెయిన్ గోడపై కూర్చొని ప్రమాదవశాత్తు డ్రెయిన్‌లో పడి మృతి చెందాడు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు. ప్రసాద్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని తప్పించబోయి..

- కల్వర్టును ఢీకొట్టి మోటారు సైక్లిస్టు మృతి

జీలుగుమిల్లి, జనవరి, 15 : (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన లక్ష్మీపురం వద్ద జరిగింది. కుక్కునూరుకు చెందిన జి.హరీష్(40) జీలుగుమిల్లిలో బంధువుల ఇంటికి సంక్రాంతి సందర్భంగా వచ్చాడు. అనంతరం బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై తాడువాయి వెళ్లి తిరిగి వస్తుండగా లక్ష్మీపురం జాతీయ రహదారి వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు మార్జిన్‌లో ఉన్న తూము కల్వర్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కాగా బంధువులు జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఎస్‌ఐ వి.నవీన్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

చింతలపూడి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి పట్టణం శివారు ఆంథోనినగర్ వద్ద సంక్రాంతి రోజున ఆగి ఉన్న కోళ్ళ వ్యానును అదుపు తప్పి మోటారు బైక్ ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న తిమ్మిరెడ్డిపల్లికి చెందిన ఈదర్ భరత్‌కుమార్(28) మృతి చెందగా అతని సోదరుడు గాయాలపాలై ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఫాతిమాపురం నుంచి చింతలపూడి వైపు బైక్‌పై తిమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు సోదరులు వస్తుండగా బైక్ అదుపు తప్పి వ్యానును ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. వీరిని చింతలపూడి ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యలో భరత్‌కుమార్ మృతి చెందగా ఏలూరులో పోస్టుమార్టం జరిపి తిమ్మిరెడ్డిపల్లి గ్రామానికి తరలించారు. అతని తమ్ముడు నాగరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.


పెదగొన్నూరులో సినీ నిర్మాత కెఎల్.నారాయణ కుటుంబీకుల ఆత్మీయ కలయిక

ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు

కలిదిండి , జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహు మతులు ప్రదానం చేశారు. కనుమ సంద ర్భం గా గ్రామాల్లో రైతులు పశువుల కొమ్ములకు రం గులు వేసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పక్షుల కోసం ఇంటి ముందు ధాన్యపు కంకులను వేలాడదీశారు.

ముదినేపల్లి: సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా బుధవారం ముదినేపల్లి మండలం సింగరాయ పాలెం -చేవూరుపాలెం సెంటర్ లోని వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గోపూజ వైభవంగా నిర్వ హించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి ఏర్పాట్లు పర్యవేక్షిం చారు. అర్చకులు గోపూజలు నిర్వహించారు.

● దుర్గా ఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్ నారాయణ స్వగ్రామమైన ముదినేపల్లి మండలం పెదగొన్నూరులో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. పండుగ సందర్భంగా ఆయ న కుటుంబీకులు, స్నేహితులు కలిశారు. అం దంగా అలంకరించిన రెండెడ్ల బండిపై కెఎల్ కుటుంబసభ్యులు గ్రామంలో తిరిగారు. పండు గ మూడు రోజులు స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడపడం చాలా ఆనందంగా ఉందని నారాయణ తెలిపారు.

చాట్రాయి : చాట్రాయిలో ద్రోణంరాజు కుటుంబ సంక్రాంతి సంబరాలు గ్రామస్తులకు కనువిందు అయింది. దివంగత ద్రోణంరాజు నరశింహశర్మ, నిర్మల కుమారి దంపతులకు 6గురు కుమారులు, 5గురు కుమార్తెలు కాగా, వారి వారసులు దేశ విదేశాలలో సుమారు 100 మంది ఉన్నారు. వారంతా ఏటా సంక్రాంతికి చాట్రాయి వచ్చి రిటైర్డు తహసీల్దార్ ద్రోణం రాజు రాఘవరావు గృహంలో సంబరాలు జరు పుకోవడం ఆనవాయితీ. లండన్, చెన్నై, హైదరా బాద్, రెండు తెలుగు రాష్ట్రాలలో ఉద్యోగాలు చేస్తున్న ద్రోణంరాజు కుటుంబీకులు ఈ ఏడాది పండుగకు 2 రోజుల ముందే సుమారు 80 మంది వచ్చి సంక్రాంతి సంబరాలు జరుపుకు న్నారు. సుమారు 25 ఏళ్లనుంచి ఏటా కుటుంబ సభ్యులంతా కలిసి సంక్రాంతి పండుగ జరుపు కుంటున్నామని రాఘవరావు చెప్పారు.


చాట్రాయిలో సంక్రాంతికి వచ్చిన ద్రోణంరాజు కుటుంబం

వైభవంగా జగన్నాథస్వామి గ్రామోత్సవం



ముదినేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి గ్రామోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించిన రథంలో స్వామివార్లను ఊరేగించారు. స్వామికి మహి ళలు హారతులిచ్చారు. అర్చకులు అగ్నిహోత్రం శ్రీని వాసాచార్యులు, ఫణి కుమార్ ఆచార్యులు పూజలు నిర్వహించారు.

గుర్వాయిపాలెంలో అలంరించిన బిగ్ బాస్ విన్నర్ నిఖిల్



కలిదిండి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బిగ్ బాస్ విన్నర్, టీవీ సీరియల్స్ హీరో నిఖిల్ గుర్వాయిపాలెంలో నిర్వహించిన కోడిపందేలను తిలికించారు. సీరియల్స్‌కు కెమెరామెన్‌గా పని చేస్తున్న నిక్కు దినేష్ రాజు ఇంటికి వెళ్లి వారి కుమారుడి భోగిపండ్ల వేడుకలో పాల్గొని ఆశీర్వ దించారు. సంక్రాంతికి పల్లెల్లో గడపడం సంతో షంగా ఉందన్నారు.


పెదపాలపర్రులో అగ్నికి ఆహుతైన మినుము పైరు

మూడు ఎకరాల మినుము పైరు దగ్ధం

ముదినేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమా దంలో ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామ ఏరియాలోని మూడు ఎకరాల విస్తీర్ణం లో మినుము పైరు పూర్తిగా దగ్ధమయింది. రైతు కన్నెపోటు శ్రీనివాసరావుకు చెందిన ఐదు ఎకరాల విస్తీర్ణంలో మినుము పైరు సాగు చేయగా మూడు ఎకరాల పైరు అగ్నికి ఆహుతైంది.

దీంతో సుమారు లక్షా 20 వేలకు పైగా పెట్టుబడి నష్టం కలిగింది. ఎవరైనా కావా లని పైరుకు నిప్పంటించారా? లేక ప్రమాదవ శాత్తు జరిగిందా అన్నది తెలియదు. పైరు చేతికి వస్తే సుమారు రూ.4 లక్షలకు పైగా ఆదాయం వ చ్చేది. దీనిపై రైతు శ్రీనివాసరావు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు.


కలిదిండిలో కోడిపందేల శిబిరాన్ని తొలగిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

కోడిపందేల శిబిరాల తొలగింపు

కలిదిండి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిపందేల శిబిరాలను ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలసి తొలగిం చారు. బుధవారం సాయంత్రం కోడి పందేలు, పేకాట, గుండాట శిబిరా లను మండల,గ్రామ కమిటీ సభ్యులు తొలగించారు.

జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ టీమ్ చీఫ్‌గా బడేటి

ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, రిషికేష్, హరి ద్వార్‌తో పాటు సుమారు 9 రాష్ట్రాల్లో ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వరకు జరిగే 38వ జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ టీమ్ చీఫ్‌గా బడేటి వెంకటరామయ్య నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయక్రీడల్లో పాల్గొనేం దుకు మొత్తం 21 క్రీడాంశాలు అర్హత సాధిం చాయి. బడేటి వెంకటరామయ్య ప్రస్తుతం ఇండి యన్ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షు లు, ఏపీ ఒలంపిక్స్ సంఘం ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. 2010లో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడకు డిప్యూటీ కాంపిటీషన్ మేనేజరుగా గతంలో జరిగిన జాతీయక్రీడల్లో అనేక హోదాల్లో సేవ లందించారు.


కలిదిండిలో కోడిపందేలు.. కైకలూరు మండలం భుజబలపట్నంలో కోడి పందేలు.. తిలకిస్తున్న మంత్రి పార్థసారథి, తదితరులు

కోడ్ఢే

- జోరుగా సాగిన కోడి పందేలు
- చేతులు మారిన కోట్లాది రూపాయలు
- ఏరులై పారిన మద్యం

కలిదిండి/ముదినేపల్లి/మండవల్లి/ కైకలూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండ లంలో గుర్వాయిపాలెం, కలిదిండి, ఎస్.ఆర్పీ అగ్రహారం, పోతుమర్రు, తాడినాడ, కొండంగి, పెదలంక గ్రామాల్లో మూడు రోజులపాటు జోరుగా కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వ హించారు. మద్యం ఏరులై పారింది. బరుల్లో కోడిపందేలతో పాటు కోతాట, గుండాటలు నిర్వహించారు. సుమారు రూ.4 కోట్ల మేర చేతు లు మారాయి. తాడినాడలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రిపూట కోడిపందేలు మూడు రోజులూ నిర్వహించారు. ముదినేపల్లి మండలం బొమ్మి నంపాడు, వడాలి, పెయ్యేరు, పెదపాలపర్రు గ్రామాల పరిధిలో పందేలు భారీ ఎత్తున జరగ్గా బరుల వద్ద పేకాట, గుండాల ఇతర జూదాలు నిర్వహించారు. మూడు రోజులపాటు కోడి పందేల్లో సుమారు రూ.15 కోట్లు పందాల రూపంలో చేతులు మారగా, పేకాట, గుండా టల్లో మరో రూ.2 కోట్లు పందాలు జరిగినట్లు సమాచారం. బొమ్మినంపాడు బరిలో నాలుగు, పెదపాలపర్రు బరిలో మూడు, వడాలి బరిలో మూడు, బుల్లెట్లు అందజేశారు. సుమారు రూ. 27.50 లక్షల పది రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్లను కోడిపందేల విజేతలు దక్కించుకున్నారు. బుధ వారం పెదపాలపర్రు బరిలో మండ లంలోని వడాలికి చెందిన మద్రివాడ సుధాకర్ రెడ్డి బుల్లెట్ గెలుచుకున్నారు. ముదినేపల్లి మండ లంలో కోడిపందేలు, ఇతర జూదాల నిర్వహణకు సంబంధించి 22 మందిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని పలు చోట్ల దాడులు నిర్వహించి బైండోవర్ కేసులు పెట్టారు. మండవల్లి మండలంలో నిర్వహించిన కోడి పందేలు, పొట్టేలు పందేల పేరుతో సుమారు రూ.20 కోట్ల మేరకు చేతులు మారినట్లు సమాచారం. మండవల్లి మండలం చావలిపా డులో ఏర్పాటు చేసిన పొట్టేల పోటీల్లో భారీగా సొమ్ము చేతులు మారింది. ఆంధ్ర, తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పొట్టేల పందేలకు భారీ సంఖ్యలో తరలి రావడంతో పం దెం జోరుగా సాగింది. బుధవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి కేపీ సారధి కూడా పొట్టేలు పందేలను వీక్షించారు. మండలంలోని చింతపా డు, పుల్లపర్రు, లోకుముడి, చావలిపాడు, భైరవపట్నం, మండవల్లి, పెరికేగూడెం, లింగాల, కానుకొల్లు, ఇంగిలిపాకలంక వంటి గ్రామాల్లో కోడిపందేలు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి బరిలు నిర్వహిం చారు. అంతేకాకుండా పందెం రాయళ్ళను ప్రోత్సహించడానికి ఒకే బరిలో ఎక్కువ పందేలు గెలిపొందిన వారికి ప్రత్యేక ఆకర్షణ బహుమతులుగా బుల్లెట్, ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్ వంటివి శిబిరాల వద్ద నిర్వహకులు ఏర్పాటు చేశారు. కైకలూరు మండలంలో మూడు రోజుల్లో సుమారు రూ.30 కోట్లు చేతులు మారాయి. కైకలూరు మండలం భుజబల పట్నంలో జోడ పందేలు ఎక్కువగా నిర్వహించారు. ఒక్కో పందెం లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జరిగాయి. ఆటపాక, కొట్టాడ, శృంగవరప్పాడు, గుమ్మళ్ళపాడు, పందిరిపల్లి గూడెం, రాచపట్నం, వరహాపట్నం, ఆచవరం గ్రామాల్లో పందేలు భారీగా నిర్వహించారు. కైకలూరు మండలం భుజబలపట్నంలో జరిగిన పందేలను రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారధి తిల కించారు. ఎంపీ పుట్టా మహేష్ తన తండ్రి మైదకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో కలిసి పందేలను తిలకించారు.


నూజివీడులో కోడి పందేలు

నూజివీడు నియోజకవర్గంలో..

ముసునూరు/నూజివీడు టౌన్/చాట్రాయి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలో కోడిపందేలు, జూదం జోరుగా సాగాయి. సంక్రాంతి, కనుమ రెండురోజుల్లో లక్షలాది రూపాయాలు చేతులు మారాయి. బుధవారం చెక్కపలిలో కోడిపందేలను ఎంపీ పుట్టా మహేష్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే తనయుడు గద్దె క్రాంతి, మంత్రి కొలుసు పార్థసారథి తనయుడు కొలుసు నితిన్‌కృష్ణ తిలకించారు. పందేల్లో విజేతకు నిర్వాహకులు ప్రకటించిన బులెట్ వాహనాన్ని నితిన్ కృష్ణ అందజేశారు. గోపవరంలో కోడిపందేలకు ప్రభా స్ కల్కి సినిమా డైరెక్టర్ నాగ అశ్విన్ విచ్చేసి సందడి చేశారు. ఎన్ఆర్ఐలు, తెలంగాణ, ఇతర జిల్లాల నుంచి మహిళలు అధికసంఖ్యలో కోడిపందేలకు తరలివచ్చి, చేతుల్లో డబ్బులు పట్టుకుని పందేలు కాయడం విశేషం. కోడిపందేలు బరులు వద్ద పేకాట, గుండాట తదితర జూదాలు జరిగాయి. పందెంరాయుళ్ళకు అవసరమైన మద్యం సరఫరా యథేచ్ఛగా సాగిం ది. బరులు చుట్టు ప్రక్కల ప్రాంగాణాలు సైతం వాహనాలతో నిండిపోయాయి. బుధవారం సాయంత్రం 6 గంటలకు కోడి పందేలు నిలిపివేసిన పోలీసులు, గ్రామాల్లో ఎక్కడ కోడిపందేలు జరుగకుండా చర్యలు చేపట్టారు. నూజివీడు మండలం, పట్టణ ప్రాంతాల్లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కోడిపందేల్లో దాదాపు రూ.20కోట్లకు పైగా చేతులు మారినట్లు అంచనా. ముసుగు పందెం, సాధారణ పందేలు జోరుగా సాగాయి. టెంట్‌లు వేసి విద్యుత్‌దీప కాంతుల మధ్య వీడియో, ఫొటోగ్రఫీలతో ప్రత్యేక పాస్‌లను ఏర్పాటు చేసి పందేలు నిర్వహిం చారు. మునుపెన్నడూ లేని విధంగా నూజివీ డులోని పందేల బరులకు తెలంగాణ రాష్ట్రంనుంచి పందెంరాయుళ్ళు బారులు తీరారు. మరోవైపు కోసు, లోన, బయట వంటి జూద క్రీడలు సైతం జోరుగా సాగాయి. చాట్రాయి మండలంలో చిత్తపూరులో సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడి పందేలు జోరుగా జరి గాయి. చనుబండ, పోలవరంలలో మోస్తరుగా పందేలు వేశారు. మహిళలు అధిక సంఖ్యలో పందేలు కాశారు. కోసు, గుండాట నడిచాయి.

చనుబండలో విజేతకు బుల్లెట్ బైక్

చనుబండ కోడి పందేలలో విజేతగా నిలిచిన కొత్తూరుకు చెందిన వ్యక్తికి తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, నిర్వాహకులు బుల్లెట్ బైక్‌ను అందజేశారు.


చిత్తపూరులో జరుగుతున్న కోడి పందేలు


నూజివీడులో బరుల వద్ద బారులు తీరిన వాహనాలు.. పెయ్యేరు బరిలో గుండాట.. ముదినేపల్లి మండలం పెదపాలపర్రు కోడిపందేల్లో బుల్లెట్‌ను గెలుచుకున్న సుధాకర్ రెడ్డి


మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో విద్యుత్ కాంతులు, అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

కిటకిటలాడిన మావుళ్లమ్మ ఆలయం

భీమవరం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలా డింది. సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చిన ప్రజలు అమ్మవారిని అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు. శ్రీనివాస కూచిపూడి నృత్య నికేతన్ బృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం హైద రాబాద్‌కు చెందిన సినీ కొరియోగ్రాఫర్, కూచిపూడి బృందం నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఉత్సవ ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలను ఆలయ ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేశ్ పర్యవేక్షించారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

వైభవంగా ప్రభల తీర్థం

ఆచంట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలం లోని పెనుమంచిలి, కందరవల్లి సరిహద్దు ప్రాంతంలో పచ్చని పొలాల మధ్య బుధవారం ప్రభల తీర్థం వైభవంగా నిర్వ హించారు. సంక్రాంతి పండుగలో కనుమ రోజు వల్లూరు, కరుగోరుమిల్లి, కోడేరు, పెను మంచిలి, కందరవల్లి ఆలయాల నుంచి ఊరేగింపు వచ్చిన ప్రభలు అక్కడ కొలువు దీరుతాయి. ఆచంట పరిసర ప్రాంతాల ప్రజ లు పెద్దఎత్తున ప్రభల తీర్థానికి తరలి వస్తారు. స్వామి వార్లకు పూజలు చేస్తారు. ఆయా గ్రామాల నుంచి ప్రభలు వరి చేలు, కాలువల్లో నుంచి ఊరేగింపు తరలి రావడా న్ని ప్రజలు సంభ్రమాశ్చర్యాలతో తిలకిస్తారు. కొద్ది గంటల సేపు జరిగి వేడుక ఆధ్యా త్మిక శోభకు అద్దం పడుతుంది. ఎస్ఐ కె.వెంకట రమణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మహిళల ఆర్థికాభివృద్ధితో దేశాభివృద్ధి

చాట్రాయి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మహి ళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాలకోటిరెడ్డి అన్నారు. నరసింహరావుపాలెం శివారు గుడి పాడుకు చెందిన 181 మంది మహిళలకు బుధవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పేదలకు చేయూత నివ్వటం, జన్మభూమి రుణం తీర్చుకోవాలనే సదాశయంతో తమ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రిటైర్డు పోస్టు మాస్టర్ సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో క్లబ్ కో-ఆర్డినేటర్ లక్ష్మి, సభ్యుడు వజ్రాల రాజ్‌గోపాల్, ఇన్‌చార్జి హెచ్ఎం చిట్టిబాబు, వెంకటేశ్వరరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.


మహిళలకు కుట్టు మిషన్లు అందించిన క్లబ్ సభ్యులు


ముగ్గులపోటీల విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి

ముగ్గుల పోటీల విజేతలకు పట్టుచీరలు

కైకలూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సం క్రాంతి పండుగకు మహిళలు వేసిన ముగ్గులు ఎంతో శోభను తీసుకువచ్చాయని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి కళామండపం వద్ద ఎంపీటీసీ సభ్యుడు మంగినేని రామకృష్ణ, కామి నేని రాజేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన మహిళలుకు ఒక్కొక్కరికి రూ.10 వేలు విలు వగల పట్టుచీరలను ఎమ్మెల్యే కామినేని అంద జేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు పైడిమర్రి రాధాకృష్ణ పారిశుధ్య కార్మికులకు అందించిన నూతన వస్త్రాలను ఎమ్మెల్యే అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మీ, సర్పంచ్ నవరత్నకుమారి, జనసేన నాయకులు తోట లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ విజేతలుగా లయోలా, ఏలూరు జట్లు

నూజివీడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు డీఏఆర్ కళాశాలలో నిర్వహించిన ఆక్రో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ శ్రీరాజా వెంకటాద్రి అప్పారావు బహదూర్ 48వ మెమోరియల్ ఆంధ్రా, తెలంగాణ ఓపెన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ విజేతలుగా పురుషుల విభాగంలో లయోలా హైదరాబాద్, మహిళల విభాగంలో ఏలూరు జట్లు నిలిచాయి. మంగళవారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో స్వస్తిక్ హైదరాబాద్ జట్టుపై లయోలా హైదరాబాద్ విజయం సాధించింది. ఇక మహిళల విభాగంలో డీఎస్ఏ పల్నాడు జట్టుపై ఏలూరుజట్టు విజయం సాధించింది. విజేతలకు నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనుమ పండుగకు మద్యం, మాంసం దుకాణాల రద్దీ

చాట్రాయి, జనవరి 15(ఆంధ్యజ్యోతి): కనుమ పండుగ సందర్భంగా మండలంలో మాంసం మద్యం దుకాణాలు రద్దీగా మారా యి. మాంసాహారులు కనుమ పండుగ రోజు తప్పని సరిగా ముక్క ఉండాలనే సెంటి మెంట్‌తో మాంసం దుకాణాలకు ఎగబడ్డారు. కనుమ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు భారీగా బాయిలర్ కోళ్లు, మేకలు గొర్రెలు దింపారు. మద్యం దుకాణాలు కూడా మందుబాబులతో కిటకిటలాడాయి.

అయ్యప్పస్వామికి అభిషేకం

మండవల్లి జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం పెరికేగూడెంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం వైభవంగా స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అయ్యప్పస్వామి వారికి పంచా మృతాలతో అభిషేకాలు, సహస్రనామ పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు మంగళ వారం రాత్రి జ్యోతి వెలిగించి భక్తులకు దర్శనం కల్పించారు.